క్లుప్తంగా

ఫిబ్రవరి నాటికి ఇంటి, కుళాయి పన్నులు వసూలు చేయాలి

భీమడోలు: ఇంటి, కుళాయి పన్నులను వసూలు చేయాలని లేని పక్షంలో సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసకుంటామని భీమడోలు ఎంపీడీఓ జీఎల్ఎన్వీ రాఘవన్ అన్నారు. భీమడోలులో బుధవారం ఆయన సచివాలయ కార్యదర్శులు, సిబ్బందికి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జీఎల్ఎన్వీ రాఘవన్ మాట్లాడుతూ మండలంలోని ఇంటి పన్నులు, కుళాయి పన్నులను ఈనెలాఖరు నాటికి 50శాతం, ఫిబ్రవరి నెలాఖరు నాటికి 50శాతం వసూలు చేసి 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసుకుని వసూలు చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. లేని పక్షంలో సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గుండుగొలనులో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సచివాలయ కన్వీనర్ గొటికల మురళి

భీమడోలు: పోషక విలువలు గల సమతుల ఆహారం భుజించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని గుండుగొలను సచివాలయ కన్వీనర్ గొటికల మురళి అన్నారు. భీమడోలు మండలం గుండుగొలను అంగన్వాడీ కేంద్రం 23లో అంగన్వాడీ కార్యకర్త బి.రాజమణి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మురళి చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, కిషోర్‌బాలికలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం వరమని మురళి అన్నారు. మునుపెన్నడూ లేని విధంగా లబ్ధిదారులకు అధిక పోషక విలువలు గల ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పెద్దలు, మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మ్యాచ్ వీక్షిస్తున్న ఎమ్మెల్యే కొఠారు



హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: క్రికెట్ అంటే తనకు అమితమైన ఆసక్తి అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారుఅబ్బయ్యచౌదరి తెలిపారు. బుధవారం హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న భారత్– న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌ను తిలకించడానికి ఆయన వెళ్లారు. మ్యాచ్‌ను తిలకిస్తూ జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు.

సారా, మాదక ద్రవ్యాలను అరికట్టాలి



దొరసానిపాడులో సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈబీ సీఐ సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల : భావితరాలు సన్మార్గంలో నడవాలంటే సారా, మాదక ద్రవ్యాలను అరికట్టాలని ఎస్ఈబీ సీఐ ఏయూబీ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని దొరసానిపాడులో ఆపరేషన్ పరివర్తన పేరుతో సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ సుబ్రహ్మణ్యం మాదక ద్రవ్యాలు, నాటుసారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కళాజాత ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ సారా కాయడం, క్రయ విక్రయాలు జరపడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారికి సహకరించిన వారు సైతం శిక్షార్హులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ సిబ్బంది సీతారాం, సత్యంబాబు, దొరసానిపాడు, సీహెచ్ పోతేపల్లి మహిళా పోలీసులు టి.కమలకుమారి, మౌనిక తదితరులున్నారు.

ఎస్ఈబీ అధికారుల దాడులు

చింతలపూడి : చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో బుధవారం అధికారులు చింతలపూడి, లింగపాలెం మండలాల్లో దాడులు నిర్వహించారు. నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బాణావతు శ్రావణి అనే మహిళను అరెస్ట్ చేసి 15 లీటర్ల సారా, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. లింగపాలెం మండలం పుప్పాలవారిగూడెం గ్రామంలో నిట్టా ఎలీషా అనే మహిళ నుంచి 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ సాయిస్వరూప్ తెలిపారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగు

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



లబ్ధి పొందిన నగదు వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు



చానమిల్లి జగనన్న కాలనీల్లో విద్యుత్ మీటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నిడమర్రు: నవరత్న పథకాల అమలుతో రాష్ట్రంలోని ప్రతి ఇంటా వెలుగు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. నియోజకవర్గంలో చేపట్టి 117వ రోజు బుధవారం నిడమర్రు మండలం చానమిల్లి గ్రామ సచివాలయం పరిధిలో ఆయన గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు గత మూడేళ్లలో ప్రభుత్వ పరంగా అందిన నగదు లబ్ధిని వివరించి, సంబంధిత సంక్షేమ బావుటా కరపత్రాలను అందించారు. పథకాల అమలు తీరుపై ప్రజల స్పందన తెలుసుకున్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే వాసుబాబు చెప్పారు. ప్రభుత్వ విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. మనబడి నాడు–నేడు పథకంతో వచ్చే మూడేళ్లలో ప్రభుత్వ బడుల్లో ఆధునిక హంగులతో అభివృద్ధి చెంది, ప్రభుత్వ విద్యారంగానికి పూర్వవైభవం వస్తుందని అన్నారు. గ్రామంలోని ఉన్నత పాఠశాల నాడు–నేడు పథకం ఫేజ్–2లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. గ్రామ వాలంటీరు వ్యవస్థ ద్వారా సమస్యలకు తగిన పరిష్కార మార్గాలను తెలుసుకోవచ్చన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు

నిడమర్రు మండలంలోని 13 జగనన్న కాలనీ లేఅవుట్లలో రూ.2.6 కోట్లతో విద్యుత్ వెలుగులు నింపుతున్నట్లు ఎమ్మెల్యే వాసుబాబు తెలిపారు. చానమిల్లి జగనన్న లేఅవుట్‌లో రూ.26 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు వీధి దీపాల మీటర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు ప్రభుత్వం తీసుకుందన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వాసుబాబు అన్నారు. బువ్వనపల్లిలో రూ.30 లక్షలతో చేపట్టిన రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన ధర్మ చెరువు అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. సచివాలయం సిబ్బందికి పలు సూచనలు చేశారు. రూ.20 లక్షలు జెడ్పీ, రూ.10 లక్షలు ముఖ్యమంత్రి అభివృద్ధి నిధుల నుంచి సమీకరించినట్లు వాసుబాబు తెలిపారు. చెరువు పనులు నిర్వహించే గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, పార్టీ చానమిల్లి అధ్యక్షుడు గరికిపాటి సాయిరాం, సర్పంచ్ నంద్యాల ప్రసాదు, ఎంపీటీసీ కొత్తల సింహాచలం, వెజ్జు నరసయ్య, బేతు రాజశేఖర్, బేతు సుబ్బారాయుడు, యుద్దం శేష, బిరదా వాసు, బిరద నాని, పడాల శ్రీశైలం, కొండపల్లి వెంకట రత్నం, బేతు స్వామి, ఎంపీడీఓ పీవీవీ ప్రసాదు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, ట్రాన్స్‌కో ఏఈ ఎన్ మురళీకృష్ణ, పార్టీ బువనపల్లి అధ్యక్షుడు సంకు శ్రీనువాసరావు, ఉప సర్పంచ్ వెల్లంకి నరేష్, కార్యదర్శి చంద్రశేఖర్, అలుమోలు గంగారాం, సత్తి సత్యనారాయణ రెడ్డి, సంకు శ్రీను, తన్నీడి వాసు, పోల్నాటి ధనరాజు, కణితి గురునాథ్, దండుపాటి సత్యనారాయణ, బూసాల బాలాజీ, చెట్టే నరేష్ తదితరులున్నారు.

పీఎంజేఏవైతో అందరికీ ఆరోగ్యం



పెదవేగిలో పీఎంజేఏవై ఆన్‌లైన్ చేస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెదవేగి : అందరికి ఆరోగ్యం అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెదవేగి ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ చెప్పారు. పెదవేగి మండలంలో జరుగుతున్న ఈ–కేవైసీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో నమోదైన వారికి కేంద్ర ప్రభుత్వం జారీ చేసే ఉచిత హెల్త్‌కార్డ్ అందించడం జరుగుతుందని చెప్పారు. దీని వల్ల దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలోనైనా, ఏఆసుపత్రిలో రూ 5 లక్షల వరకు వైద్యం చేయించుకొనే అవకాశం ఉంటుందని ఎంపీడీఓ వివరించారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 70 శాతం వరకు అయిందని, దానిని 90 శాతం పూర్తి చేసేలా కృషి చేస్తున్నామని అన్నారు.

పొలాల్లో సందడే సందడి

- సార్వా,దాళ్వా పనుల్లో రైతులు, కూలీలు బిజీబిజీ
- ప్రభుత్వ ప్రోత్సాహంపై రైతుల హర్షం



చేలో నాట్లు వేస్తున్న కూలీలు



వరి నాటేందుకు చేలో దమ్ము చేసిన దృశ్యం



ముండూరులో నారుమడులు

పెదవేగి : దాళ్వా వరిసాగు చేసే పనుల్లో రైతులు బిజీబిజీగా కనిపిస్తున్నారు. దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా పెదవేగి పరిధిలో ఈ ఏడాది 350 హెక్టార్‌లో వరి సాగు అవుతుంటే, దెందులూరు మండలంలో 3,400 హెక్టార్‌లు, పెదపాడు మండలంలో దాళ్వా సాగులో 720 హెక్టార్ల నారుమడి పూర్తయింది. ఏలూరు రూరల్ 430 హెక్టార్‌లు సాగవుతుండగా, మొత్తం 4,900 దాళ్వా సాగులో ఉండగా, ప్రస్తుతం 3,650 హెక్టార్‌ల్లో నారుమడులు పూర్తైయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఎకరం విస్తీర్ణం భూమికి అవసరమైన నారు కోసం 5 సెంట్ల విస్తీర్ణంలో నారుమళ్లు తయారు చేస్తున్నారు. పెదవేగి మండలంలోని ప్రధాన నీటి చెరువుల్లో కొంత మేర నీరు చేరడంతో రైతులు ఎంతో ఆశతో పూర్తిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ప్రాంతంలో ముఖ్యంగా 1156,1153, 1121 వరి విత్తనాలను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం రైతులు మరగడ దమ్ములు చేస్తున్నారు. విత్తనాలను వెదజల్లేందుకు ముందు నారుమడిని రెండు లేక మూడు పర్యాయాలు దమ్ము చేసిన అనంతరం రైతులు చదును చేస్తున్నారు. మడిని పాయలుగా విడదీసి విత్తనాలు వెదజల్లుతున్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి....

వరి నారుమళ్లు పోసే రైతులు తప్పని సరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి. దీనివల్ల పంటకు అగ్గితెగులు సోకే అవకాశం ఉండదు. ఒక లీటరు నీటిలో 5 గ్రాముల ట్రైకోడెర్మావిర్డీని లేదా సుడోమోనాస్‌ను కలిపి విత్తనశుద్ధి చేయాలని ఏడీఏ జి.నరేంద్ర తులిపారు.వరి నారుమడి పోసిన తర్వాత 15 రోజుల్లో జింక్, ఐరన్‌లోప నివారణ చర్యలు తీసుకోవాలి. దీనికోసం రెండు శాతం జింక్ సల్ఫేట్, అన్నభేది నిమ్మ ఉప్పును పిచికారి చేయాలి. నారుమడిలో నీరు పెట్టడానికి తొలగించడానికి అనువుగా కాల్వలు ఏర్పాటు చేయాలని ఏడిఏ రైతులకు సూచించారు.

త్వరితగతిన నాట్లు పూర్తి చేయాలి

రైతులు దాళ్వానాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి. నీటి ఎద్దడికి గురికాకుండా సకాలంలో పంటను ముగించాలి. నారుపోసిన 25 రోజుల తర్వాతనే నారుపీకి నాటు వేసుకోవాలి. కాండం తొలుచు పురుగు, ఆకు తొలుచు పురుగు నివారణ కోసం నాట్ల వేసేందుకు నారు పీకేందుకు ముందుగా మడిలో ఎకరానికి 1కేజీ కార్బోఫ్యూరాన్ గుళికలను చల్లాలి.

యు.సుబ్బారావు ఏడీఏ ఏలూరు

విద్యుత్ ఉద్యోగులపై దాడులు చేస్తే సహించం

దెందులూరు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం 24 గంటలూ విద్యుత్ సేవలందిస్తున్న ఉద్యోగులపై దాడులు చేస్తే సహించేది లేదని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శిశిధర్ అన్నారు. బుధవారం దెందులూరులో విద్యుత్ శాఖ ఏఈ రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాట్లాడుతూ దెందులూరు మండలం దోసపాడు గ్రామంలో గడువు తేది లోపు కరెంటు బిల్లు కట్టలేదని, బిల్లులు చెల్లించాలని పదేపదే చెబుతున్నా కడిమి బేబి కట్టకపోవడంతో సాయి అనే వ్యక్తి దోసపాడు గ్రామ విద్యుత్ లైన్‌మేన్ బొల్లే సుధాకర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది అహర్నిశలు పనిచేస్తున్నారని అటువంటి వారిపై ఇలాంటి దాడులు చేయడం బాధాకరమన్నారు. ఇక మీద ఎవరైనా విద్యుత్ సిబ్బందిపై దాడి చేస్తే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఏడీలు ఓంకార్, త్రివాస్, భీమేశ్వరరావు, లైన్‌మేన్ల సంఘం ఏలూరు డివిజన్ నాయకులు జే.వీరయ్య, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మేన్లు ఉన్నారు.

ఉపాధి హామీ సొమ్ము రికవరీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ

డ్వామా పీడీ రాంబాబు ఆదేశం

పోలవరం రూరల్ : ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి పోలవరం మండలం పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశంలో రూ.లక్షా 15వేల 842 రికవరీ చేయాల్సిందిగా డ్వామా పీడీ డి.రాంబాబు ఆదేశించారు. గ్రామాల్లో 2021–2122 సంవత్సరాల్లో చేపట్టిన పనులకు వారం రోజులు తనిఖీ చేసి సిబ్బంది ఈ నివేదిక ఇచ్చినట్లు ఆయన చెప్పారు. అధికారులు కార్యాలయాలు వదిలి గ్రామాల్లో పనులు పరిశీలిస్తే అసలు విషయాలు తెలుస్తాయన్నారు. రెండు సంవత్సరాల్లో వేతనాల రూపంలో రూ.13కోట్ల 22 లక్షలు చెల్లించగా 4 కోట్ల 68లక్షల పనులు జరిగాయన్నారు. సిబ్బంది చేసిన వివిధ తప్పిదాల వల్ల రూ. 9 వేలు జరిమానా విధించామన్నారు. వివిధ భవనాల నిర్మాణాల రీత్యా డ్రా చేసిన బిల్లులు 15 రోజుల్లో నిర్మాణాలు ప్రారంభించకపోతే ఆ నిధులు రికవరీ చేయాలన్నారు. పర్యవేక్షణా లోప భూయిష్టంగా ఉందన్నారు. చనిపోయిన వారి పేర్ల మీద మస్తర్లు వేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పనికి వెళ్లకపోయినా చిరుద్యోగుల పేర్లు నమోదు చేయడంపై మండిపడ్డారు. ఇలాంటి తప్పిదాలు మరలా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబును ఆదేశించారు. ఉపాధి పనులపై ఎంతో మంది ఆధారపడి ఉన్నారని వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రతి కుటుంబానికి పని కల్పించడమే కాకుండా జాబ్‌కార్డులు కూడా మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో పి.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

21నుంచి ఆటల పోటీలు ప్రారంభం



పోటీల పోస్టర్‌లను విడుదల చేసిన నిర్వాహకులు

బుట్టాయగూడెం : ఈ నెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ టీబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో 4వ సీజన్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆటల పోటీలకు సంబంధించిన పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ సరియం చల్లయ్య మాట్లాడుతూ కబడ్డీ, వాలీబాల్, విలువిద్యలో నాటు బాణంతో పాటు మోడ్రన్ బాణం పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాలీబాల్, కబడ్డీ విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గో బహుమతులుగా రూ.25 వేలు, రూ.15 వేలు, 10 వేలు, రూ.5 వేలు అందిస్తారన్నారు. అదే విధంగా విలువిద్య విభాగంలో నాటు బాణం, ఆధునిక బాణంలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి ఎంట్రన్స్ ఫీజు కట్టాల్సిన అవసరంలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, నాయకులు కారం రమణ, తెల్లం దేవరాజు, కుక్కల గోపి, కోరం దుర్గారావు, దినేష్, రాజు, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

లక్కవరంలో రెండు ఎద్దుల మృతి

జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరం ఎర్రకాలువ ప్రధాన కాలువలో రెండు ఎద్దులు మునిగి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. లక్కవరానికి చెందిన రైతు బొప్పనేటి లక్ష్మీనారాయణ తన ఎడ్లపై వరినారు వేసుకుని పొలం వెళ్లే క్రమంలో ఈ ప్రమాదంలో సంభవించింది. ఎద్దులు కాలువ దాటే ప్రయత్నం చేయడంతో మునిగిపోయాయి. లక్ష్మీనారాయణ కాలువ గట్టుపై ఉండటంతో అతనికి ప్రమాదం తప్పింది. మృతి చెందిన ఎద్దులు విలువ రూ.1,50,000 ఉంటుందని రైతు తెలిపారు.

ముగిసిన త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు





ఉత్సవ పూర్ణాహుతిలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అర్చకులు, భక్తులు, భక్తి సంగీత కచేరి నిర్వహిస్తున్న వేదుల జయలక్ష్మి, గుడిపాటి శిరీష

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గత డిసెంబర్ 29 నుంచి ప్రారంభమైన స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. మూడు వారాల పాటు ఆలయంలో స్వామి వారికి నిత్య కల్యాణాలు, విశేష అలంకరణలు, లక్ష తులసి, లక్ష కుంకుమార్చనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నిత్యం సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి, శ్రీ విష్ణు సహస్రనామార్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాదా వినియోగం చేశారు.

స్వామి వారికి శ్రీచక్ర స్నాన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా జరిగింది. సాయంత్రం 5 గంటలకు నగరానికి చెందిన వేదుల జయలక్ష్మి, గుడిపాటి శిరీష నిర్వహించిన భక్తి సంగీత కచేరి భక్తులకు వీనుల విందు చేసింది. రాత్రి 7 గంటల నుంచి స్వామి వారికి దర్బారు సేవ చేశారు. అనంతరం శ్రీవారి పవళింపు సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి ఆంధ్ర రవిశంకర్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

జర్మనీలో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాలు నిర్వహణలో ఆంధ్రులు

పెదపాడు: తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతిని డ్యూసెల్ డ్రాప్‌లో జర్మనీలోని తెలుగు వారు ఘనంగా నిర్వహించారు. 400పైగా అతిధులు పాల్గొని 20కి పైగా సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో కనుల విందుగా జరిగింది. కరోనా విరామం తరువాత రెట్టించి ఉత్సాహంతో ఇంట్లో వేడుక వాతావరణాన్ని తలపించేలా పండగ పిండివంటలతో ఫుల్‌డే ఈవెంట్ నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కుటుంబాలు పాల్గొన్నాయి.

ఆధునిక పద్ధతుల్లో చేపల పెంపకం ద్వారా లాభాలు

డీఆర్‌డీఏ పీడీ కె.విజయరాజు



మేడిశెట్టివారిపాలెంలో ఆర్ఎఎస్ పద్ధతిలో చేపల పెంపకాన్ని చేపట్టిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

చింతలపూడి : ఆధునిక పద్ధతుల్లో చేపల పెంపకం ద్వారా అధిక లాభాలను ఆర్జించవచ్చునని డీఆర్‌డీఏ పీడీ కె.విజయరాజు అన్నారు. మండలంలోని చింతంపల్లి పంచాయతీ, మేడిశెట్టివారిపాలెం గ్రామంలో తొలిసారిగా ఆర్ఎఎస్ పద్ధతిలో చేపల పెంపకాన్ని చేపట్టిన ప్రాజెక్టును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాండ్ర రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ విజయరాజు మాట్లాడారు. తక్కువ స్థలంలో తక్కువ నీటితో అతి తక్కువ మంది కూలీలతో చేపల పెంపకాన్ని ఈ పద్ధతిలో సాగు చేయవచ్చునని ఆయన తెలిపారు. కేవలం బోరు నీటితోనే చేపల పెంపకం చేపట్టవచ్చునన్నారు. దీనికి ప్రభుత్వం కూడా సహకారం అందిస్తుందన్నారు. ఐఆర్‌డిఓ, సేవా ఎన్‌జీఓల సహకారంతో గ్రామంలో యు సత్యవతి అనే మహిళా రైతు చేపట్టిన చేపల పెంపకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామకృష్ణారావు మాట్లాడుతూ సీతానగరం యూనియన్ అందించిన రూ.1.5 లక్షల రుణంతో పాటు ఐఆర్‌డిఓ మరో రూ.50 వేలు గ్రాంట్ క్రింద విడుదల చేసినట్లు చెప్పారు. గ్రామ పంచాయతీలో చేపల పెంపకంపై ఆసక్తి ఉన్న యువతను, మహిళలను గుర్తించి డీఆర్‌డిఏ సహకారంతో మరిన్ని యూనిట్లు నెలకొల్పనున్నట్లు చెప్పారు. ఐఆర్‌డిఓ బై బ్యాక్ పద్ధతిలో రైతులు సాగు చేసిన చేపలను మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంతో ఈ ప్రాంతంలో మరిన్ని చేపల పెంపకం యూనిట్లు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. మహిళలు చేపల పెంపకాన్ని జీవనోపాధిగా మలుచుకోవాలని కోరారు.